


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

❦❦❦

***మా నాన్న బంగారు***

ెలుగు సాహిత్యంలోనూ, ఆకాశవాణి ప్రసారాలలోనూ మా నాన్న శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తిగారు చేసిన కృషి గురించి చాలామంది వారి అమూల్యమైన అభిప్రాయాల్నీ అమితమైన ఆదరణనీ ఈ అభినందన సంచికలో తెలియపరిచారు.. సంతోషం.

ఓ తండ్రి, తన పిల్లల గురించి చెప్పుకోవటం సహజమే కావచ్చు. కానీ ఓ తండ్రి గురించి కొడుకులు చెప్పటం సంప్రదాయం కాదేమో! అయితే ఆయన మాకు 'నాన్న' అయినందుకు గర్వపడుతూ, ఆయన మాకిచ్చిన, నేర్పిన కొన్ని విలువైన నిధుల గురించి మీకు మనవి చేసుకోవాలన్న తపనతో ఈ అవకాశాన్ని తీసుకుని సవినయంగా ఈ నాలుగు మాటలూ మీకు చెప్పాలనుకుంటున్నాను.

సాధారణంగా తల్లిదండ్రులు చెప్పే మాటలు విని పిల్లలు నేర్చుకునే విషయాలు బహు తక్కువ. అయితే పిల్లలు, జీవితమంతా గుర్తుంచుకునే విషయాలు తల్లిదండ్రుల ప్రవర్తన చూసే నేర్చుకుంటారని నా భావన. మేం, మా పట్ల విశ్వాసాన్నీ, వినయాన్నీ ఇతరులపట్ల గౌరవాభిమానాన్నీ అన్నింటినీ మించి 'నీతి - నిజాయితీ'లనూ మా నాన్నగార్ని చూసే నేర్చుకున్నాం. 'తల్లీ - తండ్రీ' అనే జంట పదాల్లో అమ్మ 'ఓర్పు - సహనాలకు' ప్రేరణ అయితే, నాన్న మరో 'మంచి గుణం' మాలో పెరగటానికి కారణమయ్యారు. అదే ఆత్మ విశ్వాసం.

ఓ గేయ రచయిత అందుకే అన్నారు.

"నీతికి నిలబడువానికి - ఏనాటికి ఓటమి లేదనీ - మంచిని పెంచినవానికి - ఏ వంచన ఏమీ చేయదనీ"

నేను ఈ ఫిలాసఫీ నా జీవితానికి అన్వయించుకునేందుకూ, అలాగే ఆత్మవిశ్వాసంతో సమస్యల్ని ఎదుర్కొనేటందుకూ కారణం, నన్ను పెంచుతున్నప్పుడు ఆయన నాకిచ్చిన 'నమ్మకంతో కూడిన స్వేచ్ఛ'

'టీనేజ్‌లో వున్నప్పుడు' నాన్న మా విషయాల్లో లేదా విజయాల్లో అంతగా 'పార్ట్' తీసుకోలేదేమో అని కొంత బాధపడిన మాట నిజం. ఈ సంగతిని నాన్నగారే స్వయంగా ఓ టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు ఆ మధ్య. అయితే నాకు కొంత వయసొచ్చాక నేను కూడా ఇద్దరు పిల్లలకు తండ్రిని అయ్యాక - నా 'ఊహ' కేవలం 'అపోహ' మాత్రమే అని గ్రహించగలిగాను. ఆకాశవాణిలో నాన్న పనిచేసే రోజుల్లో వార్ని దగ్గరగా పరిశీలించే అవకాశం నాకు దొరికింది. ఆ పరిశీలన ఎక్కడో నా అంతరాల్లో నిగూఢమైపోయి వుండిపోయుంటుందని, నేననుకుంటున్నాను. వారికి, వారి పనిపట్ల వున్న అంకితభావం, వారు గుణాలూ, నాకు వుంటే బావుంటుందేమో అనిపించింది.

'మాకు బడి తరగతుల మధ్యలో, ఒక తండ్రి నేర్పవలసిన ఎన్నో పాఠాల్ని - ఇంట్లోనే మధ్య తరగతి కుటుంబాల పాఠాలలో ఇమిడ్చి మరపురాని కథలుగా ఎంతోమంది తెలుగు కుటుంబాలతోపాటు మాకూ పంచి ఇచ్చారు. మా తాతగారు మా నాన్నగారికి చాలా ముందుచూపుతో 'రామచంద్రమూర్తి' పేరు పెట్టారని నాకు అనిపిస్తూంటుంది. (పేరుకి ముందు 'శ్రీ' లేకపోయిందే, అని నాన్న అప్పుడప్పుడు చమత్కరిస్తుంటారు. అయితే మా అమ్మే ఆయనకు 'శ్రీ' అని మేం అంటూంటాం.)

'బైదివే' మా పెద్దబ్బాయికి నేను పెట్టుకున్న పేరు ఆ 'రామచంద్ర స్ఫూర్తి.. అలాగే మా ఇద్దరు పిల్లల్నీ నేను 'నాన్న బంగారు' అంటూ పిలుచుకోవటం వాళ్ళు నా బంగారు తండ్రులే కాదు. నా తండ్రి కూడా 'బంగారమే' కనుక ఆ సందర్భం ఇక్కడ పూర్తిగా వర్తించదేమో కానీ, ఆ మధ్య నాన్న రాసిన ఒక నాటిక పేరు నాకు గుర్తుకొస్తోంది. అది "డాడీ యూ ఆర్ గ్రేట్"

**జీడిగుంట వేణుగోపాల్**

**(కనిష్ఠ పుత్రుడు)**

## *'రోల్ మోడల్' తాతయ్య*

మా తాతయ్యతో నాకు నా చిన్నప్పటినుంచీ ఎన్నో 'స్వీట్ మెమొరీస్' వున్నాయి. నేను నాలుగో ఏటనే మా అమ్మా నాన్నలతో అమెరికా వెళ్ళిపోయాను. ఆ తర్వాత ఇండియా ఎప్పుడొచ్చినా తాతయ్యగారింట్లోనే వుండేవాణ్ణి. నన్ను ప్రతిరోజూ తన బైక్ మీద ఎక్కడికో అక్కడికి తీసుకెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు నాకు ఇష్టమైన 'స్టిక్ ఐస్ క్రీమ్స్' కొనిపెట్టిన సంఘటనలు నేను ఎప్పటికీ మరిచిపోలేను.

అసలు మా తాతయ్య అంటే ఎంత ఇష్టమో నేను మాటల్లో చెప్పలేను. 1997లో నా సినిమా కెరీర్ 'స్టార్ట్' అయినప్పటినుంచీ మొదటి సినిమా 'హ్యాపీడేస్' రిలీజ్ అయినప్పటినుంచీ అన్ని సినిమాలూ, మొదటిరోజు, మొదటి ఆట చూసి విశ్లేషించి నన్నెంతో ఎంకరేజ్ చేసేవారు.

"తాతయ్యా నీకోసం నేను మళ్ళీ ఓ సూపర్ హిట్ కొడతాను"

నా పట్ల తాతయ్య చూపించే ప్రేమ, కన్‌సర్న్, ఎటెన్షన్ వీటికి ‘లిమిట్‘లేదు. తన జీవితంలో, నేను గమనిస్తున్నప్పటినుంచీ, ఎన్నో సిట్యుయేషన్స్ ఎదుర్కొని గెలిచారు. అది నాకు ఇన్‌స్పిరేషన్ ఇస్తుంది. తాతయ్య సాధించిన దాంట్లో సగం సాధించినా చాలనిపిస్తుంది నాకు.

మా తాతయ్యని ”రోల్ మోడల్‘గా తీసుకుని నేను కూడా తనలాగానే నా జీవితంలో నా కుటుంబ సభ్యులకూ, నాకు పుట్టబోయే పిల్లలకూ అందరికీ ‘రోల్ మోడల్‘ కావాలని నా ఆశ.. నా కోరిక.

‘Lead by Example’కి డెఫినెషన్ మాతాతయ్యే!

You are better than best తాతయ్యా! నువ్వు రాస్తున్న నీ జ్ఞాపకాల చరిత్రలో నాకు కూడా ఒక పేజీ కేటాయించినందుకు ధన్యవాదాలు. ఆల్ ది బెస్ట్

**నీ మనుమడు**
**వరుణ్ సందేశ్**
**(పెద్దమనవడు)**

***సంపాదించింది దాచుకోవాలి .***

తాతయ్యంటే నాకు విపరీతమైన గౌరవం. మా ప్రేమ ప్రయాణాన్ని పెళ్ళివరకూ తీసుకు వెళ్ళే విషయంలో, సందేశ్ తల్లిదండ్రులూ, ఇతర కుటుంబ సభ్యులతోపాటు తాతయ్య కూడా ఎంతో ఎక్కువగా ఎంకరేజ్ చేశారు. నన్ను సొంత కూతురిలా చూసుకుంటూ ఎప్పుడు కనిపించినా ‘ఎలా వున్నావ్ బంగారూ?‘ అని అడుగుతుంటారు. తాతయ్య, బామ్మ ఇద్దరూ కూడా నన్ను చాలా బాగా చూసుకుంటారు. ప్రతిరోజూ ఎవరో ఒకరు ఫోన్ చేసి నా క్షేమ సమాచారాలు తెలుసుకుంటారు.

తాతయ్య ఈ రోజు ఈ పొజిషన్‌లో ఓ ప్రముఖ రచయితగా, సెలబ్రిటీగా వుండటానికి ఎన్ని కష్టాలు పడ్డారో మాకు అప్పుడప్పుడు చెప్తూంటారు. సిన్సియర్‌గా వుండాలి. కాన్ఫిడెంట్‌గా వుండాలి. సంపాదించింది దాచుకోవాలి. అని నాకూ సందేశ్‌కీ జాగ్రత్తలు చెప్తూ, ధైర్యాన్ని ఇస్తారు.

మా ‘కెరియర్‘ బాగుండటం కోసం ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. స్త్రీలు అందర్నీ చాలా గౌరవిస్తారు. వాళ్ళ పిల్లల్నీ, మనవల్నీ నైతిక విలువలతో బాధ్యతాయుతంగా పెంచారని అర్థం చేసుకున్నాను.

Thankyou Taatayya for every thing.. You are an inspiration for us and coming generations. Best wishes for your జ్ఞాపకాల చరిత్ర.

**నీ మనుమరాలు వితిక**
**(వరుణ్‌సందేశ్ శ్రీమతి)**

***"ఎ గైడ్ అండ్ ఫిలాసఫర్"***

జీడిగుంట రామచంద్రమూర్తి!...

ఈ పది అక్షరాల వెనుక ఒక మనసుని తాకి, కదిలించే రచయిత ఉన్నారు. ఆయనే తాతగారు. ఆయన మౌనంలో వున్నంత అర్థం మరెందులోనూ లేదు.

నేను చిన్నప్పుడు అనుకునేదాన్ని - తాతగారు చాలా 'సీరియస్ మనిషి' అని. కానీ నేను తప్పుగా అర్థం చేసుకున్నానని ఇప్పుడు తెలుసుకున్నా. ఆయన మౌనంలో వుండేది కోపం కాదు. ప్రేమ, ఆలోచన. మా తాతగారి నువ్వు చూస్తే నాకొచ్చే ఆనందానికి అంతుండదు. మరెందులోనూ ఇంత ఆనందాన్ని అనుభవించలేదేమో. మా జీవితంలో ఆయన మాకెన్నో నేర్పించారు. ఆయన మాటల ద్వారా, కథల ద్వారా అవన్నీ కాగితం మీద పెట్టాలంటే ఈ భూమిపై వున్న 'చెట్లే' చాలవు. (అతిశయోక్తి కోసం ఆ మాట వాడినా ఇది వాస్తవం.)

ఆయన మాటల్లో మాకు కవిత్వం వినిపిస్తుంది. నేను అమెరికా లో పెరిగాను. అందుకే తెలుగు రాయటం చదవటం వచ్చేది కాదు. ఈ మధ్యనే ఇండియా తిరిగి వచ్చాక నేర్చుకుంటున్నా. కేవలం ఆయన పుస్తకాల్లోని కథలు సొంతంగా చదవటానికే. ఈ పట్టుదల కూడా ఆయన దగ్గరే నేర్చుకున్నా. ఆయనెపుడూ అన్నింటికంటే మా మంచినే ఎక్కువగా కోరుకుంటారు. ఇతరులను ఎప్పుడూ ఇబ్బంది పెట్టరు. ఆయన కథల్లో రాసే మానవ సంబంధాల్నీ, విలువల్నీ ఆయన స్వయంగా పాటిస్తారు.

ఆయన ఒక విషయాన్ని మాకు పదే పదే చెపితే అది ఆయన 'చాదస్తం' అని చిన్నప్పుడు అనుకునేదాన్ని. కానీ ఆ విధంగా పదే పదే చెప్పటం వెనుక - ఆయన ఎంత 'ఆలోచన పెడతారో ఇప్పటిదాకా తెలుసుకోలేకపోయాను. ఒక్కమాట కూడా ఏదో ఒక కారణం లేకుండా చెప్పరు. చిన్న వయసులో ఇవన్నీ పట్టించుకోం. మన దృష్టి ప్పుడు ఆటలపైనే సాగుతుంది. యవ్వనంలో అడుగుపెట్టగానే పెద్దల ఆలోచనలూ, అను భవాలూ మనల్ని ముందుకు నడిపిస్తాయి. ఇండియా తిరిగి వచ్చాక ఈ వయసులోనే ఎక్కువకాలం మా తాతగారితో గడుపుతున్నాను. ఈ కారణంగా కొత్త స్ఫూర్తిని పొందగలుగుతున్నాను. కేవలం తాతగారిలాగానే కాకుండా, ఆయన మాకు 'గైడ్' గా వుండి పదికాలాలపాటు మమ్మల్ని మంచిబాటలో నడిపించాలి.

***జె. వీణా సాహితీ***
***(పెద్ద మనమరాలు)***

***'తాతయ్యంటే గౌరవంతో కూడిన భయం'***

మా తాతయ్యగారికి ఆరుగురు మనుమలు, ఇద్దరు మనుమరాండ్రు వున్నారు. వారందరిలో ఆయనతో ఎక్కువ సమయం గడిపింది నేనేనని గర్వంగా చెప్పుకుంటాను. అందువల్ల తాతయ్యతో పంచుకున్న జ్ఞాపకాలు నాకు ఎక్కువగా ఉన్నాయి. అందుచేత తాతయ్య క్యారెక్టర్ మొత్తంకాకపోయినా, ఎనభై శాతం నాకే తెలుసునని నా అభిప్రాయం.

చిన్నప్పటినుంచీ, నాకు తాతయ్యంటే భయం. తిడతాడనో, కొడతాడనో భయంకాదు. గౌరవం వల్ల ఏర్పడిన భయం అది. తనకున్న ఇమేజ్‌కి తగినట్టుగా తాతయ్య కొంత గంభీరంగాను, కొంచెం తక్కువగానూ మాట్లాడేవారు. మేం అడిగే

ప్రశ్నలకు జవాబు ఇవ్వటం తప్ప - తాను స్వయంగా దేనికీ మమ్మల్ని ప్రశ్నించటంకానీ, మాట్లాడటంకానీ చాలా తక్కువనే చెప్పాలి. చాలా ఇండిపెండెంట్ మనిషి. ఎవరిపైనా ఆధారపడే రకంకాదు. లోపల ఎన్ని ఆలోచనలు వున్నా బయటికి కనిపించనీయరు. అఫ్‌కోర్స్. నాకు కూడా ఆయన పోలికే వచ్చిందనుకుంటాను.

నేను స్కూలుకి వెళ్ళే రోజుల్లోనే ఆయనతో ఎక్కువ సమయం గడిపేవాణ్ణి. అవే నాకు చాలా మంచిరోజులు. వీకెండ్స్‌లో అప్పుడప్పుడు మా తాతయ్య మాకోసం ఏదో ఒకటి వండిపెట్టేవారు. బయటకు వెళ్ళినప్పుడు, మా కోసం బిరియానీలూ, ఐస్‌క్రీములూ తెచ్చిపెట్టేవారు.

'తాతయ్యకి క్రికెట్ అన్నా, టెన్నిస్ అన్నా చాలా ఇష్టం. టీ.వీలో వచ్చే ఏ మ్యాచ్ అయినా సరే 'మిస్' అయ్యేవారు కాదు. నేను కూడా ఆయనతోపాటు ఆ మ్యాచెస్ చూస్తూ 'ఎంజాయ్' చేసేవాడిని. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే మా తాతయ్యకి కాళ్ళనొప్పులు వస్తే నేనే పట్టేవాడిని. అలా ఆయన కాళ్ళు నొక్కినప్పుడల్లా నాకు పదిరూపాయలు ఇచ్చేవారు. తర్వాత నేను హైస్కూలు, యూనివర్సిటీల్లో చదివిన రోజుల్లో కూడా నాకు పాకెట్‌మనీ ఆయనే ఇచ్చేవారు.

ఒక్కోసారి మా తాతయ్య ఇంట్లో ఒకటి రెండు రోజులు ఎవరితోనూ మాట్లాడేవారు కాదు. అంటే దానర్థం ఇంట్లోని ఎవరో ఒకరు ఏదో తప్పు చేశారనుకోవాలి. ఎంత కోపమో - అంత ప్రేమ కూడా వున్న మనిషి మా తాతయ్య. మాకు చాలా 'కంఫర్ట్స్' ఇచ్చారాయన. మా నాన్న, బాబయ్య, పెదనాన్నలకంటే మాకే ఎక్కువ సౌకర్యాలు కలుగజేసేవారంటే 'జనరేషన్స్' పట్ల వున్న అండర్ స్టాండింగ్ ఎంత విలువైందో తెలుస్తుంది.

ఓ రచయితగా ఆయన గురించి చెప్పాలంటే నాకంత సీన్ లేదనుకుంటాను. అసలు ఆయన ఏం రాసినా ముందు ఇంట్లో అందరికీ వినిపించేవారు. ఆయన రాసిన కథలు చాలానే చదివాను. విన్నాను. కథలన్నీ కూడా హ్యూమన్ ఎమోషన్స్‌తో నిండివుంటాయి. చాలా కథల్లో చివర కళ్ళల్లో నీరు మెదులుతుంది. అది మా తాతయ్య కథల ప్రత్యేకత. ఇప్పుడు రాస్తున్న నీ జ్ఞాపకాల జీవిత చరిత్ర ఓ లైబ్రరీ బుక్ అవుతుందని ఆశిస్తూ ...

Love you Taatayya

All the best

**జె. శివతేజ**

**(రెండవ మనుమడు)**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS